క్లుప్తంగా

నకిలీ ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

భాగ్యనగర్‌కాలనీ: కల్తీ ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై బాలానగర్ ఎస్‌ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషీగూడలో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా అను ఫ్రోజెన్ ఫుడ్స్ పేరిట నకిలీ ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నారు. అనారోగ్యానికి గురి చేసే రంగులను వాడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఐస్‌క్రీం తయారీ కేంద్రంపై దాడి చేసి నిర్వాహకుడు రమేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. తయారీ కేంద్రంలోని ఫ్రీజర్, ఐస్‌క్రీం తయారీ వస్తువులతో పాటు చాకోబార్ 200, బేబీ కార్‌న్స్ 200, బిగ్ కార్‌న్స్ 100, క్యాండీ 1000, సింథటిక్ ఫుడ్ కలర్స్ 8 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.15 లక్షలకు పైగా ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సక్కుబాయికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: శంషీగూడకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జోగిపేట భాస్కర్ మాతృమూర్తి సక్కుబాయి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో శనివారం వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం భాస్కర్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట చెరువు వద్ద ఫ్రెండ్స్ వాకర్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మంచినీటిని వృథాగా పోకుండా చూసుకోవాలన్నారు. దప్పికతో ఉన్నవారికి గుక్కెడు మంచి నీటిని అందిస్తే ఎంతో పుణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేందర్, సీనియర్ నాయకుడు రాఘప్రసాద్, వాకర్స్ సుధాకర్‌రెడ్డి, ఓంకార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు బీజేపీ



డివిజన్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు బీజేపీ నాయకులు చేపట్టిన గడపగడపకు వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ తెలిపారు. శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్, ఛత్రపతి శివాజీనగర్, ఆశానగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ మేము సోషల్ మీడియా, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సమస్యలను తెలుసుకొని అధికారులకు, నాయకులకు తెలియజేస్తే తప్ప వారికి సమస్యలు తెలియటం లేదన్నారు. అభివృద్ధి జరగాలంటే నిత్యం బీజేపీ నాయకులు ప్రజల మధ్యలో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామరాజు, కుమార్ యాదవ్, రవీందర్‌రావు, కమలాకర్‌రెడ్డి, నర్సింగ్ యాదవ్, నర్సింగ్‌రావు, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

తులసీనగర్ అధ్యక్షుడిగా సామ కొండల్‌రెడ్డి

మోతీనగర్: తులసీనగర్ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా మూడోసారి సామ కొండల్‌రెడ్డిని జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా పూర్తి కమిటీని కూడా ఎన్నుకున్నారు. సలహాదారుడిగా సీహెచ్. బంగారు నేత, ఎస్. శేఖరాచారి, అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్ల సురేష్ కుమార్, కోశాధికారి ఆకుతోట శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎంజీవీ. ప్రసాదరావు, బి.రాములు, బి.భాస్కర్ రెడ్డి, పి. యల్లయ్య, మహిళా ఉపాధ్యక్షురాలు ఎం. సత్తెమ్మ, సంయుక్త కార్యదర్శులు ఎం.హనుమాడ్లు, జి. ఈశ్వరయ్య, సంయుక్త కార్యదర్శి కె.సురేందర్, ఎస్ దేవయ్య, ప్రచార కార్యదర్శి ఎ.ముత్యం రాజు, కార్యవర్గ సభ్యుడు బి.కిషన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని, అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగంను మర్యాదపూర్వకంగా కలిశారు. కమిటీ సభ్యులు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ తులసీనగర్‌లో 90 శాతం పనులు పూర్తి చేయించామన్నారు.

పైప్‌లైన్ రోడ్డు..

వెళ్లాలంటే గుండెల్లో గుబులు

- కాలం చెల్లిన తాగునీటి పైప్‌లైన్లతో ప్రమాదాలు
- శాశ్వత నివారణకు చర్యలు చేపట్టని అధికారులు
- గోవింద్ హోటల్ చౌరస్తాలో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్



కూకట్‌పల్లి ఉషాముళ్లపూడి రోడ్డులోని గోవింద్ హోటల్ చౌరస్తాలోని పైపులైన్ ప్రాంతం నుంచి వెళ్తున్న వాహనాలు



గోవింద్ హోటల్ చౌరస్తాలో పైపులైన్ పగిలిపోయి ఏర్పడిన గుంత

ఆల్విన్‌కాలనీ: కాలం చెల్లిన మంచినీటి ప్రధాన పైపులైన్‌లు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రహదారిపై భారీ వాహనాలు రాకపోకలు సాగించటంతో పైప్‌లైన్లు పగిలిపోయి రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఉషా ముళ్లపూడి రోడ్డు, జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలోని గోవింద్ హోటల్ చౌరస్తాలో ఇప్పటికే అనేక మార్లు మంచినీటి,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్‌లు పగిలి పెద్ద గుంతలా ఏర్పడ్డాయి. ఆ గుంతలో మురుగు, చెత్తాచెదారం వెళ్లడంతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ రహదారిని పైపులైన్ రోడ్డు అని కూడా పిలుస్తారు.

తూతూమంత్రంగా మరమ్మతులు

◆ షాపూర్ నుంచి కూకట్‌పల్లికి మంచినీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ రోడ్డు ఇదే కావటం గమనార్హం. ఈ పైపులైన్ జగద్గిరిగుట్ట ఇందిరా గాంధీ చౌరస్తాలో, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1 చౌరస్తాలో, కేఎల్‌బార్ రెస్టారెంట్ ప్రాంతంలో, గోవింద్ హోటల్ చౌరస్తాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పైపులైన్‌లకు లీక్ అవుతున్నాయి. దీంతో నీరు రోడ్డుపై చేరడంతో గుంతలు ఏర్పడుతున్నాయి. తూతూమంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవటమే తప్ప శాశ్వత పరిష్కరం చూపటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా సొమ్ము దుర్వినియోగమే కానీ శాశ్వత పరిష్కారం చూపటం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

పైప్‌లైన్లపై ఒత్తిడి పెరిగి పగిలిపోతున్నాయి..

◆ ఈ చౌరస్తా గుండా నిత్యం కుత్బుల్లాపూర్, గాజులరామారం, జీడిమెట్ల, దుండిగల్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, పటాన్‌చెరువు ప్రాంతాలలోని పారిశ్రామిక వాడలకు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పైప్‌లైన్లపై ఒత్తిడి పెరిగి పగిలిపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదే చౌరస్తాలో గత సంవత్సరం రాత్రి వేళలో పెద్ద నుయ్యిలా ఏర్పడింది. నాలుగు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో మంచినీటి పైపులైన్ పగిలిపోయి పెద్ద గుంత ఏర్పడింది. అదే సమయంలో వాహనాలు గుంతలో పడితే పెను ప్రమాదమే జరిగి ఉండేది. చాకచక్యంగా ప్రయాణికులు తమ వాహనాలను పక్కకు తీసుకెళ్లటంతో ప్రమాదం జరగలేదు.

100 ఫీట్ల విస్తరణకు చర్యలు..

◆ ఈ రహదారిలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో వన్ వే రహదారిని ఏర్పాటు చేశారు. అయినప్పటికి తరచూ ఈ రహదారిపై ప్రమాదాలు చోటు చేకుంటున్నాయి. ఈ రహదారిలో ఎక్కువ రోడ్డు వంకరగా పోతుండటంతో నిత్యం ప్రమాదాల నిలయంగా మారింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ 100 ఫీట్ల రహదారి విస్తరణ చేస్తామని మాట ఇచ్చారు. దాని ప్రకారమే స్థానిక శాసనసభ్యులు అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటే ష్‌గౌడ్, మాధవరం రోజాదేవిల సహకారంతో 100 ఫీట్ల విస్తరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఈ సమస్యలకు పరిష్కారం చూపాలి..

◆ కానీ విద్యుత్ స్తంభాల తొలగింపు, రహదారి మధ్యద్యలో ఉన్న దేవాలయం, నాడు ఏర్పడిన వాణిజ్య సముదాయాలు తొలగించటం కష్టసాధ్యంగా మారటంతో రహదారి విస్తరణకు నోచుకోవడానికి ఇబ్బందికరంగా మారుతోంది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొని రహదారి విస్తరణ, మంచినీటి పైపులైన్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గోవింద్ హోటల్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా భాగ్యనగర్ కాలనీ నుంచి ఎల్లమ్మ చెరువు వరకు స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉంటుందని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. మరోసారి సమస్య పునరావృత్తం కాకుండా మంచినీటి పైప్‌లైన్‌కు దూరంగా డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయినగర్, వెస్ట్ సాయినగర్‌లో, ఎన్‌టీఆర్‌నగర్, ఇంద్రాహిల్స్ కాలనీల్లో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఎన్నో ఏళ్ల సమస్య నేటితో తీరనున్నదన్నారు. కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి డివిజన్‌కు ఒక కిలోమీటర్ చొప్పున డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రియం, కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు నాగేశ్వరరావు, ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఉదయం 10గంటలకు సాయి ప్రశాంత్‌నగర్ కాలనీ, నందమూరి నగర్‌లలో రూ.28లక్షల వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు పునరుద్ధరణ నిర్మాణ పనులు, శ్రీనివాసకాలనీ రాజా శ్రీహోమ్స్ వద్ద రూ.25లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్డు నిర్మాణ పనులు, నాగార్జున హోమ్స్ వద్ద రూ.35 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హైదర్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ మెంబర్లు, ఉద్యమకారులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'హైదరాబాద్ టుడే కాంక్లేవ్' పై చర్చ



రాయదుర్గం: 'హైదరాబాద్ టుడే కాంక్లేవ్'పేరిట ప్రతి ఆరు మాసాలకోసారి అంతర్జాతీయ స్థాయిలో చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తామని పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మల్కకొముదయ్య పేర్కొన్నారు. పల్లవిగ్రూప్ ఆఫ్ స్కూల్స్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, మెటమొర్ఫోసిస్‌లు సంయుక్తంగా నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్‌లో రెండు రోజులపాటు సాగే 'హైదరాబాద్ టుడే కాంక్లేవ్'(హెచ్‌టీసీ) అంతర్జాతీయ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం నూతన విద్యావిధానం, సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ కాంక్లేవ్‌కు సింగపూర్‌తోపాటు దేశ వ్యాప్తంగా ఉన్న పలు స్కూల్స్ నుంచి ప్రిన్సిపాళ్లు, టీచర్లు పాల్గొని నూతన విద్యా విధానాన్ని విద్యార్థుల్లోకి ఎలా తీసుకెళ్లాలో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన విద్యా విధానం పట్ల చాలా స్కూల్స్‌కు అవగాహన కల్పించడానికి ఈ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. మొదటి రోజు స్కూల్ ఎడ్యుకేషన్‌పై, రెండవ రోజు హయ్యర్ ఎడ్యుకేషన్‌పైన చర్చా కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆదివారం జరిగే కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయ ప్రకాశ్‌నారాయణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పల్లవి స్కూల్ చీఫ్ కో ఆర్డినేటర్ యశస్విమల్క, మెటమొర్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు పవన్ ప్రసంగించారు.

సపర్యలు చేయడానికి వచ్చి ఆభరణాలతో పరార్

- నిందితుడి అరెస్టు
- రూ.7లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు



నిందితుడు బంటి చంటికుమార్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్, సీఐ నర్సింగ్‌రావు

భాగ్యనగర్‌కాలనీ: కరుడుగట్టిన నేరుస్తుడిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద నుంచి సుమారు ఏడు లక్షల రూపాయల బంగారు ఆభరణాలు, వెండిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు.

◆ ఈనెల 6వ తేదీన తన ఇంట్లో బంగారు ఆభరణాలు దొంగతనం జరిగినట్లుగా గుర్తించిన కొత్తకోట శైలజ కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తన భర్త ఆరోగ్యం బాగోలేక లేవలేని పరిస్థితి ఉండేది. తన భర్తను చూసుకునేందుకు ఓ ప్రైవేట్ సంస్థను సంప్రదించింది. ఈ క్రమంలోనే బోడుప్పల్‌కు చెందిన అన్నపూర్ణ హోంకేర్ సర్వీస్‌లో పని చేస్తున్న సైదాబాద్‌కు చెందిన బంటి చంటి కుమార్ అలియాస్ డేవిడ్ అలియాస్ రాకేష్ (26)ను సంస్థ నుంచి కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీలోని శైలజ భర్తకు సపర్యాలు చేసేందుకు నియమించారు.

◆ మూడు నెలల క్రితం బంటి చంటికుమార్ ఈ సంస్థలో చేరాడు. గత 12 రోజులుగా శైలజ ఇంటికి వచ్చి ఆమె భర్తకు సపర్యలు చేశాడు. ఈ నెల 6వ తేదీన శైలజ ఉదయం యోగా క్లాసుల కోసం బయటకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన నిందితుడు ఎలాగైనా ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు దొంగిలించటానికి పథకం వేసి బీరువాలో ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలతో పాటు, కేజీ వెండి వస్తువులను దొంగిలించి పరారయ్యాడు.

◆ దర్యాప్తులో భాగంగా ఇంట్లో భర్తకోసం నియమించిన వ్యక్తే ఈ దొంగతనానికి పాల్పడినట్లు అనుమానించిన పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు చేపట్టారు. శనివారం భాగ్యనగర్ కాలనీలోని అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా పొంతన లేని సమాధానాలు చెప్పటంతో పోలీసులు స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో ప్రశ్నించగా చేసిన నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతని వద్ద నుంచి రూ.7 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా అతనిపై రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 33 కేసులు ఉన్నాయని తెలిపారు. పీడీ యాక్ట్‌పై జైలుకు వెళ్లి తిరిగి వచ్చాడు. మరోసారి అతడిపై పీడీ యాక్ట్ పెట్టనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి సీఐ నర్సింగ్‌రావు, ఎస్సై రజాక్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పాల్గొన్న హోంమంత్రి మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి

ఇఫ్తార్‌కు హోంమంత్రి, మేయర్

మోతీనగర్: కేసీఆర్ లాంటి దార్శనికుడు ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల అదృష్టమని.. నిత్యం ప్రజల కోసం పనిచేసే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్యేగా దొరకడం కూకట్‌పల్లి ప్రజల అదృష్టమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో శనివారం ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హోం మంత్రి, మేయర్ గద్వాల విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి పండ్లను తిన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సబిహా బేగం, ముద్దం నర్సింహ యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బాబూరావు, రంగారావు, మైనార్టీ నాయకులు గౌసుద్దీన్, ఇజాజ్ అహ్మద్, ఇర్ఫాన్, రహీం, ఓమర్, జాహెద్ షరీఫ్ బాబా, ఐలయ్య, వీరారెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి



జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలంలో శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్‌ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రధానంగా నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో కూడా ఎక్కడైనా రోడ్డు పెండింగ్ ఉంటే దానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసి వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదే విధంగా నిధుల కొరత ఉంటే మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఎక్కడా కూడా మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు కూడా సర్వే చేసి ఎక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌సీ చెన్నారెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, గోవర్ధన్, ఏఈ సాయిప్రసాద్, శ్రీదేవి, రంజిత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మాక్‌డ్రిల్ @ నెక్సస్ మాల్



అగ్నిమాపక నివారణ పరికరాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కేపీహెచ్‌బీకాలనీ: తెలంగాణ అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం కూకట్‌పల్లి అగ్నిమాపక కేంద్రం ఏడీఎఫ్‌ఓ వై. సైదులు కేపీహెచ్‌బీలోని నెక్సస్ మాల్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తల గురించి వివరించారు. అగ్నిమాపక నివారణ పరికరాలను ఎలా ఉపయోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించే మార్గాలను వివరించారు. అదే విధంగా సిబ్బంది ప్రథమ కర్తవ్యాన్ని వివరిస్తూ ప్రమాద సమాచారాన్ని అగ్నిమాపక సిబ్బందికి తెలిపే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో నెక్సస్ మాల్ మేనేజర్ శ్రీనివాస్, అగ్నిమాపక సిబ్బంది లచ్చిరెడ్డి, వంశీకృష్ణ, కృష్ణ, కె.శేఖర్, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.